
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





వడ్ల కొనుగోళ్లకు సిద్ధం!

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం(ఫైల్)

- జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణకు కసరత్తు పూర్తి
- 190 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 2.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- ఉగాది తర్వాత ప్రారంభానికి చర్యలు

జనగామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా వరి కోతల సమయం దగ్గరపడుతుండడంతో ధాన్యం సేకరణకు సంబంధించిన యాక్షన్‌ను సిద్ధం చేసుకున్నారు. గత యాసంగి సీజన్‌లో మాదిరిగానే ఈ సీజన్‌లోనూ జిల్లావ్యాప్తంగా 190 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ధాన్యం సేకరణ, రవాణా, బిల్లుల చెల్లింపు వంటి అంశాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో కత్తెర పంట కోతకు రాగా యాసంగి పంట మరో 15-20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. కొన్ని చోట్ల 15-20 రోజుల్లో కోతలు ప్రారంభం కానుండగా కొన్ని చోట్ల నెల రోజులు పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉగాది తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. కాగా.. జిల్లావ్యాప్తంగా ధాన్యం దిగుబడి అంచనా, కేంద్రాల ఏర్పాటు, గన్నీ సంచులు, ప్యాడీ క్లీనర్, డ్రయ్యర్లు, టార్పాలిన్ కవర్లు ఎంత మేర అవసరమవుతాయనే అంచనాకు వచ్చి సిద్ధంగా ఉంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎలాంటి హడావిడి లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

జిల్లావ్యాప్తంగా 190 కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 12 మండలాల పరిధిలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఐకేపీ పరిధిలో 100, పీఏసీఎస్ పరిధిలో 90 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా గ్రామాల వారీగా ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలపై గ్రామీణాభివృద్ధి, సహకార శాఖలు దృష్టి సారించాయి. కేంద్రాల నిర్వహణ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలు నిర్వహించనుండగా వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

2.10 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సెంటర్లకు వస్తుందని అధికారులు అంచనా వేసుకున్నారు. గత ఏడాది యాసంగి సీజన్‌లో 1.74 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని అధికారులు భావించారు. కానీ.. గత ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా దాదాపు 30 శాతం వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వరి పంట పొట్ట దశకు వచ్చిన, కొన్ని చోట్ల కోత దశకు వచ్చిన సమయంలోనే బలమైన ఈదురుగాలులు, వడగళ్ల ప్రభావంతో వడ్లన్నీ రాలిపోయాయి. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా కేవలం 1.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కాగా.. ఈ ఏడాది అంతే మొత్తంగా సాగు చేయగా 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రకృతి సహకరిస్తే అధికారుల అంచనాకు తగ్గట్టుకు ధాన్యం దిగుబడి రానుంది. కాగా.. ఇందుకు సంబంధించి గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లను సమకూర్చుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా 52.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా ప్రస్తుతం 30.30 లక్షల గన్నీలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా 3800 టార్పాలిన్లు అవసరం కాగా అందుకు రెట్టింపు సంఖ్యలో 6174 టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా.. జిల్లాలో ఉగాది తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభిస్తాం..

- రోహిత్‌సింగ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ)



జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశాం. జిల్లాలో మరో 15-20 రోజుల్లో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ఏప్రిల్ రెండో వారంలో సెంటర్లను ప్రారంభించాలని భావిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 190 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించాం. మరో వారం, పది రోజుల్లో కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇస్తాం. ధాన్యం కొనుగోలు, రవాణా, బిల్లుల చెల్లింపు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.33 గం.
సహర్ : గురువారం ఉ : 4.58 గం.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

జనగామ కల్చరల్, మార్చి 19: టెన్త్ పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు మంగళవారం ద్వితీయ భాష హిందీ పరీక్ష నిర్వహించారు. 6698 మంది విద్యార్థులకు గాను ఆరుగురు గైర్హాజరు కాగా 6692 మందితో 99.91 శాతం విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తనిఖీ చేశారు. హెల్త్‌క్యాంపులో మందులను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి తగు సూచనలు అందించారు. అదే విధంగా రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మీ బాయి, ప్రత్యేక తనిఖీ బృందాలు, డీఈవో వలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



పాలకుర్తిలో సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పాలకుర్తి, మార్చి 19 : పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసిన విధంగా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కూడా విధులు నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణసాయానికి దూరం..

- వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పథకానికి నోచుకోని రైతులు
- అవగాహన లేకపోవడమే కారణం
- గోదాముల్లో పంటను నిల్వ చేసుకుంటే 'రైతుబంధు'
- రీజియన్ పరిధిలో రూ.28కోట్లు కేటాయింపు..
- రుణం తీసుకుంది మాత్రం నలుగురే..

వివరాలు 8లో..

ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు

ప్రణీత్‌రావు సొంతజిల్లా వరంగల్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం దృష్టి

వ్యవహారంలో వరంగల్ నేతలున్నారంటూ అభియోగాలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలోనే సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కీలకమలుపులు తిరుగుతున్న ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ వైపు దృష్టిమళ్లించారు. పర్వతగిరిలోని ఓ వ్యక్తి ఇంట్లో వార్‌రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనే ప్రచారం నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామునే వరంగల్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకున్నట్లు తెలు స్తోంది. అయితే స్పెషల్ ఇంటిలిజెన్సీ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం మేరకే ఇద్దరు సీఐలను

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

బ్యాంకర్లకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

జనగామ కల్చరల్, మార్చి 19: అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి ఆయన జిల్లాస్థాయి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే ఖచ్చితంగా ఆధారాలు ఉండాలన్నారు. రూ.10 లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్నుశాఖ పరిధిలోకి వెళ్తుందన్నారు. జిల్లాలో 86 ఏటీఎంలు ఉన్నాయని, వాటిలో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈవో నుంచి అనుమతి పొందాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా సి-విజిల్ యాప్‌లో రిపోర్టు చేయాలన్నారు. సమావేశాలు నిర్వహించాలన్నా, గోడలపై రాతలు రాయాలన్నా, ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్లు తదితర అంశాల పై సువిధా పోర్టల్‌లో అనుమతి పొందాలన్నారు.

ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ యజమానులతో సమావేశం..

ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ యజమానులతో మాట్లాడుతూ ఎలక్షన్ పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలు, యాడ్‌లు, పేరు, అడ్రస్ లేకుండా ప్రింట్ చేయకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఎల్‌డీఎం శ్రీధర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులకు ఆదేశాలు..

గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతీ బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధి కూలీలకు రూ.200 సగటు రేటును నిర్ణయించాలన్నారు. పది రోజుల్లో ఈజీఎస్ పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతీ మండలం నుంచి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, నర్సరీల్లో మొక్కలకు ఎప్పటికప్పుడు నీరందించాలని, వంద శాతం పన్నులు వసూలు చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం పోషన్ పఖ్వాడా పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీపీవో రంగాచారి, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీడబ్ల్యూవో జయంతి, డీఆర్‌డీవో మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.



సాయికృష్ణ

ఎంటెక్ విద్యార్థి అదృశ్యం

8

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- నలుగురు ఆటో, బైక్ దొంగల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు, మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ సీతారామ్

జనగామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని జనగామ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను జనగామ డీసీపీ సీతారామ్ జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్, ఫలక్‌నుమాకు చెందిన ఫిరోజ్ అలీఖాన్, రాజేంద్రనగర్‌కు చెందిన మహ్మద్ అజారుద్దీన్, మహ్మద్ బాబర్ ఈ నలుగురు ఉపాధికోసం ఆటో నడుపుకుంటున్నారు. ఈ క్రమంలో వారు గంజాయి, మద్యం, స్మోకింగ్‌కు బానిసకావడంతో పాటు జల్సాలకు అలవాటు పడ్డారు. ఆటో నడపడం వల్ల వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. 2022, 2023లో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, మేడిపల్లి, చిలుకలగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆటో దొంగతనాలు చేసి పట్టుబడి జైలు జీవితం అనుభవించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా దొంగతనాలను మానలేదు. జహీరాబాద్, బీబీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు వారాల క్రితం రెండు బైకులను ఎత్తుకెళ్లారు. కాగా.. మూడు రోజుల క్రితం ఈ నలుగురు జనగామ బస్టాండ్ పక్కన గల్లీలో పార్కు చేసిన ఆటోను ఎత్తుకెళ్లి పెంబర్తి బైపాస్ సమీపంలో కింగ్స్‌వే దాబా వెనుక నిర్మానుష్య ప్రదేశంలో దాచారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి మరుసటి రోజు పెంబర్తిలో మరో ఆటోను దొంగతనం చేసి అదే ప్రదేశంలో పార్కింగ్ చేసి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం దొంగతనం చేసిన రెండు బైకులపై జనగామకు చేరుకొని దాచిఉంచిన రెండు ఆటోలను వరంగల్‌లో అమ్మేందుకు తీసుకెళ్తుండగా పెంబర్తి వై జంక్షన్ వద్దకు రాగానే వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై భరత్, ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు కర్ణాకర్, రామన్న, అనిల్‌కుమార్, సాగర్, సురేశ్‌లను డీసీపీ అభినందించారు. జనగామ ప్రజలు తమ ఇళ్లు, దుకాణాల ముందు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో ఏసీపీ దామోదర్‌రెడ్డి, సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై భరత్ ఉన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు..

- ఫోన్ ట్యాపింగ్‌లో నన్ను ఇరికించే కుట్ర
- అవినీతిపరులే బీఆర్ఎస్‌ను వీడుతున్నారు..
- శ్రేణుల్లో ఆందోళన వద్దు.. అండగా ఉంటాం..
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎర్రబెల్లి, వినయభాస్కర్

రాంనగర్, మార్చి 19: తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, గిట్టని వారు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. అవినీతిపరులు ఆస్తులు కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌ను వీడి అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. అవకాశవాదులు పోయినంతమాత్రాన ఆందోళ చెందాల్సిన అవసరం లేదని, తాము కేడర్‌కు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ మోసకారి అని, ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాడని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలుచేయలేక చేతులెత్తేశాడని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అవగాహన రాహిత్యంతో రైతుల పంటలు ఎండుతున్నాయని ఆయన అన్నారు. కాళేశ్వరం పిల్లర్లు కుంగాయని సాకు చూపి నీళ్ల ఆపారని ఆయన ఆరోపించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, పార్టీలోనే ఉంటానని, బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని ఎర్రబెల్లి పేర్కొన్నారు. పోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, వార్‌రూమ్ అనే విషయం తనకు తెలియదన్నారు. ప్రణీత్‌రావు అమ్మమ్మ ఊరు పర్వతగిరి అని, ఆయనకు తనతో ఎలాంటి పరిచయం లేదన్నారు. పోన్ ట్యాపింగ్‌లో తనను ఇరికిం చే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ లోక్‌సభ అభ్యర్థి గా బరిలో నిలుస్తున్న కావ్యను గెలిపించుకుందామని దయాకర్‌రావు శ్రేణులకు పిలుపునిచ్చారు.

హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఫొటో పెట్టుకుని విజయం సాధించి, అధికారాన్ని అనుభవించి స్వలాభం కోసం పార్టీని వీడటం సిగ్గుచేటన్నారు. చెట్టుకు ఎండిన ఆకులు రాలిపోతున్నాయని, చెట్టు, వేర్లు బలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మళ్లీ చెట్టు చిగురిస్తుందని, కాయలు కాస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చోటా భాయ్, కేంద్రంలోని బడా భాయ్ కలిసి కేసీఆర్‌పై కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తాను ఫుల్‌టైమ్ పొలిటీషియన్‌నని ఆయన తెలిపారు. పార్ట్‌టైమ్ పొలిటీషియన్‌లు పార్టీ మారినంతమాత్రాన జరిగే నష్టం లేదని వినయభాస్కర్ పేర్కొన్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. వరంగల్ నుంచి ఎంపీగా తాను విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కె.వాసుదేవరెడ్డి, సుందర్‌రాజ్, లలితాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

అధికారులకు ఎన్పీడీసీఎస్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు



ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి, మార్చి 19: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ 33/11 సబ్‌స్టేషన్‌తో పాటు రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎక్కువ అంతరాయాలు ఎందుకు వస్తున్నాయనే అంశమై ఆరా తీశారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లు అమర్చక పోవడంతో ఏబీ కేబుల్స్ దెబ్బతిన్నాయని, దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఫ్యూజ్‌లు తరుచుగా పోవడంతో ఎల్‌సీ తీసుకోవలసి వస్తోందని, తద్వారా ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ తక్షణమే ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏబీ స్విచ్‌లను అమర్చాలని, దెబ్బతిన్న కేబుళ్లను తక్షణమే మార్చాలని ఆదేశించారు. ప్రతీ ఏఈ డేబైడే సబ్‌స్టేషన్లను తనిఖీ చేయాలని, లాగ్‌బుక్‌లో నమోదు చేసిన అంతరాయాలను, రిలేలో రికార్డు చేసిన అంతరాయాలతో సమానంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని ఆదేశించారు. ఓఅండ్‌ఎం సిబ్బంది భద్రతానియమాలు పాటించాలని, ఎల్‌సీ తీసుకున్నప్పుడు తప్పనిసరిగా హెర్త్‌రాడ్ ఉపయోగించాలని సూచించారు. ప్రతీ ఫీడర్ పరిధిలో సమస్యలను తగ్గించి మెరుగైన విద్యుత్ అందించాలన్నారు.

కార్యక్రమంలో ఎస్‌ఈ వేణుమాధవ్, డీఈఈలు లక్ష్మీనారాయణ రెడ్డి, హుస్సేన్ నాయక్, విజయ్‌కుమార్, ఏడీఈ సత్యనారాయణ, మనోహర్ రెడ్డి, ఏఈలు చంద్రమోహన్, శివకుమార్, రమేష్, సబ్ ఇంజనీర్ వరుణ్, ఐఎన్‌టీయూసి రాష్ట్ర నాయకుడు నీలం ఐలేష్, సిబ్బంది గబ్బెట సుధాకర్, రాజేందర్, సురేందర్ రెడ్డి, ఐలయ్య, అశోక్, సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠ నిఘా!

'కోడ్' నేపథ్యంలో పోలీసుల తనిఖీలు

వెస్ట్‌జోన్ పరిధిలో 6 చెక్‌పోస్టుల ఏర్పాటు



పెంబర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై సృజన్

జనగామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జనగామ పోలీసులు పటిష్ఠ నిఘా పెట్టారు. జిల్లాలో అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వెస్ట్‌జోన్ పరిధిలో 6 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దుల వెంట ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై పెంబర్తి, కొడకండ్ల మండలం మొండ్రాయి, బచ్చన్నపేట మండలం కొన్నె, తరిగొప్పుల మండలం హన్యానాయక్ తండా, జఫర్‌గడ్, రాయపర్తి వద్ద పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టులతో పాటు ఎక్కడికక్కడ ఆయా పోలీస్ స్టేషన్ల వారీగా కూడా నిఘా పెట్టనున్నారు. గ్రామాల్లో సైతం బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖలు దృష్టి పెట్టాయి. అంతేగాకుండా బందోబస్తు కోసం అదనపు పారా మిలటరీ బలగాలను రప్పించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఈ బలగాలు ఎన్నికల బందోబస్తులో పాల్గొంటాయి. ప్రస్తుతానికి 70 మందితో కూడిన ఒక కంపెనీ పారా మిలటరీ ఫోర్స్ రాగా.. పోలింగ్ తేదీ నాటి మరో కంపెనీ బలగాలు రానున్నాయి. ఎన్నికల సందర్భంగా ఆయా మండలకేంద్రాల్లో అదనపు బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నారు. ఎన్నికల వేళ ఎలాంటి సంఘ విద్రోహక చర్యకు పాల్పడొద్దనే ఉద్దేశంతో పాత నేరస్థులను సైతం బైండోవర్ చేయనున్నారు. జిల్లాలో 19 లైసెన్స్ రివాల్వర్‌లు ఉండగా వాటిని పోలీసులు తమ వద్ద డిపాజిట్ చేసుకోనున్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

వరంగల్ జిల్లా, మార్చి 19: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురు, శుక్ర వారం మూడు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

న్యాక్ జాతీయ సదస్సులో వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, మార్చి 19: విద్యాసంస్థల స్వయం సమృద్ధితో విద్యా విధానాల్లో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలపై మంగళవారం దేశ వ్యాప్తంగా బెంగళూరలోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్ నుంచి సదస్సులో పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం న్యాక్ అధికారులు దేశంలోని వివిధ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్లు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. రాబోయో రోజుల్లో న్యాక్ అక్రిడేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలు, అక్రిడేషన్ పొందిన విద్యాసంస్థలకు వచ్చే ప్రయోజనాలతోపాటు విద్యార్థులకు కల్పించాల్సిన, సమాజానికి అవసరమైన విద్యాసంస్థల స్వయం సమృద్ధి కోసం చేయాల్సిన బాధ్యతలు చర్చించారు. డిజిటలీకరణ, అకడమిక్ క్రెడిట్స్, ఫిర్యాదుల పరిష్కారం యంత్రాంగం, అభిప్రాయ సేకరణ, విద్యాసంస్థల్లో ఉన్న ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ పనితీరుపై చర్చించారు. జాతీయ విద్యావిధానంలో పొందుపరిచిన లక్ష్యాలను అందుకునేందుకు దృష్టి పెట్టాల్సిన అంశాలనూ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, కేయూ క్వాలిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, ప్రొఫెసర్ ఎన్.గోపి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.



న్యాక్ జాతీయ సదస్సులో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఇతర అధికారులు

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి దుర్మరణం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: అతి వేగం ఓ టెక్నోక్రాట్‌ను బలితీసుకుంది. కారును అతి వేగంగా నడపడం వల్ల సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తార్నాక వైజంక్షన్‌లో డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వరంగల్ నిట్ విద్యార్థి క్షితిజ్‌రాజ్(22) దుర్మరణం పాలయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్షితిజ్‌రాజ్ నిట్‌లో ఈఈఈ నాలుగో సంవత్సరం చదువుతు న్నాడు. ఈ ఘటనలో మరో నలుగురు నిట్ విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వివరా ల్లోకి వెళితే.. స్నేహితుడి ఇంటర్వ్యూ కోసం సోమవారం వరంగల్ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ కార్‌ను అద్దెకు తీసుకొని క్షితిజ్‌రాజ్, ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థి హర్షిత్ మ హేశ్వరి, ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి అర్జునతన్వర్, ఎంఎంఈ నాలుగో సంవత్సరం విద్యార్థి నవీన్ దవన్, ఎం ఎంఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కపిల్ హైదరాబాద్ వెళ్లారు. తార్నాక సమీపంలోని పీఎస్ వై జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అతివేగంగా నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో క్షితిజ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తార్నాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిట్ విద్యార్థి రోడ్డు ప్రమాదంతో దుర్మరణం పాలవడంతో నిట్‌లో ఒక్క సారిగా విషాదఛాయలు అలముకొన్నాయి.



క్షితిజ్ రాజ్ (ఫైల్)

సరిహద్దుల్లో అలజడి

మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు ● నలుగురు మావోయిస్టుల మృతి

మహదేవపూర్, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల వేళ తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో మంగళవారం తెల్లవారుజామున అలజడి రేగింది. సుమారు రెండున్నర గంటలపాటు పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన హోరాహోరీ ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. గడ్చిరోలి జిల్లా రేపనపల్లికి సౌత్ ఈస్ట్ ప్రాంతంలో 8 కిలోమీటర్ల దూరంలోని కొలమార్క గుట్టల్లో ఈ ఘటన జరిగింది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతుందన్న పక్కా సమాచారంతో అహెరీ అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. తెల్లవారుజామున ఒక డెన్‌లో ఉన్న మావోయిస్టులను చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు ప్రారంభించగా మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగడంతో సుమారు రెండున్నర గంటల పాటు కొలమార్క గుట్టల ప్రాంతంలో తుపాకీ చప్పుళ్లతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. కాల్పులు ముగిసిన తర్వాత పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా ఈ ఘటనలో తెలంగాణలోని మంగీ- ఇంద్రవెల్లి ఏరియా కమిటీ సభ్యుడు, కొమురంభీం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన వర్గీస్(28), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భైరాన్‌ఘర్ జిల్లా కొత్రాంకు చెందిన జిల్లా కమిటీ సభ్యుడు, సిర్పూర్ - చెన్నూరు కార్యదర్శి పాండు అలియాస్ మంగులు (32), ప్లాటూన్ మెంబర్లు కురుసంగి రాజు , కుడిమేత వెంకటేశ్ మరణించినట్టు గుర్తించారు. సంఘటనా స్థలంలో ఏకే 47 రైఫిల్ ఒకటి, ఒక కార్బన్, మరొక కంట్రీమేడ్ పిస్టల్, మావోయిస్టుల సాహిత్యం, పేలుడు పదార్థాలు, వంట సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుంచి మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకొని వెళ్లారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఈ నలుగురిపై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం రూ. 36లక్షల రివార్డును ప్రకటించడం విశేషం. ఇక తప్పించుకున్న మావోయిస్టులు ఏయే ప్రాంతాలవైపు వెళ్లే అవకాశం ఉందన్న పక్కా ప్రణాళికలతో పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కొలమార్క గుట్టలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్ఠపరిచి తప్పించుకున్న మావోయిస్టులను మట్టుబెట్టడమే లక్ష్యంగా పోలీసులు కూంబింగ్ చేస్తున్నారు.

టెన్షన్.. టెన్షన్..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 72 గంటల్లోపే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కట్టడికి కూంబింగ్ చేపట్టారు. అలాగే రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులు చికిత్స కోసం తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో గోదావరి తీర ప్రాంతం వెంట పటిష్ఠ భద్రతను అప్రమత్తం చేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇక తాజా ఘటనలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఐజీ సందీప్ పాటిల్, గడ్చిరోలి జోన్ డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ జగదీష్ మీనా, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్‌లను ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారి ఉన్నతాధికారులు ప్రశంసించారు.



కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

అంతర్రాష్ట్ర వంతెనపై పోలీసుల తనిఖీలు

మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో అప్రమత్తమైన కాళేశ్వరం పోలీసులు అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గోదావరి మీదుగా మావోయిస్టులు తెలంగాణలోకి వచ్చే అవకాశం ఉండడంతో గ్రామస్థులకు అవగాహన కల్పించి.. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని సూచిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మహదేవపూర్ సిఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతల చర్చలు

- కడియం కావ్యను మార్చాలని ఉద్యమకారుల డిమాండ్
- అదిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్న నేతలు
- లేదంటే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిక

రాంనగర్, మార్చి19: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతలు దాస్యం వినయభాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, సుందర్ రాజ్ భేటీ అయ్యారు. మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో భేటీ అయిన నేతలు.. నిరసన గళం వినిపిస్తున్న ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, బండి రజనీకుమార్, వీరేందర్, చింతల యాదగిరితో చర్చలు జరిపారు. పార్టీలో సభ్యత్వంలేని, రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కడియం కావ్యను ఎలా అభ్యర్థిగా ప్రకటిస్తారని ఉద్యమకారులు ప్రశ్నించారు. తమలో ఒకరికి అవకా శం ఇవ్వాలని చేస్తున్న అభ్యర్థనను ఏ మాత్రం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమం జసమని వారు నేతలను ప్రశ్నించారు. ఒకే ఇంట్లో నుంచి ఇద్దరికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఏంటని వారు నేతల దృష్టికి తీసుకువచ్చారు. వారంరోజుల్లో కడియం కావ్యను మార్చి తమలో ఎవరికైనా అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనను పార్టీ అధిష్ఠానం పట్టించుకోకుంటే జయశంకర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి కార్యాచరణ ప్రకటిస్తామని నేతలకు తేల్చిచెప్పారు. కాగా, ఉద్యమకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని నేతలు పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. అధిష్ఠానం సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు.

క్రషర్స్ యజమానులకు సమస్యలు పరిష్కరించాలి



డీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి19: మైనింగ్ శాఖ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లును కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న డీడీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టోన్ క్రషర్స్ యజమానులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డీడీ వెంకటేశ్వర్లును కోరారు. అనంతరం మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివరావును కలిశారు. కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుల పేరాల మధుసూధన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్, స్టోన్ క్రషర్స్ యజమానులు దేవేందర్ రెడ్డి, రాంరెడ్డి, సుజిత్‌రావు తదితరులు డీడీని కలిసిన వారిలో ఉన్నారు.

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: విదేశాల్లో ఎంఎస్, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత విభాగం ప్రకటన జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. www.nosmsje.gov.in అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.

చేసిన తప్పును ప్రజలు ప్రజలు గుర్తించారు..

● దొంగ హామీలను నమ్మి బీఆర్ఎస్‌ను ఓడించారు.. ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, మార్చి 19: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటి వరకు కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేశారని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డికి మాయమాటలు చెప్పడం మొదటి నుంచి అలవాటేనన్నారు. అవినీతి చేసిన నేతలు ఆస్తులు కాపాడుకు నేందుకు పార్టీ మారుతున్నారని ఆయన ధ్వజ మెత్తారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాని ఎర్రబెల్లి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయభాస్కర్ మాట్లాడుతూ.. స్వలాభం కోసం నేతలు పార్టీ మారుతున్నారని ఆరోపిం చారు. శ్రేణులు వారివెంట వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేదీ లేదని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉందన్నారు. ఎవరో కొందరు పార్టీ వీడినంత మాత్రాన జరిగే నష్టం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్, వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, కడియం కావ్య, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చింతల యాదగిరి వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా పలువురు వర్ధన్నపేట బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. పదేళ్ల పదవులు అనుభవించి, ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ వీడటం ఎంతవరకు సమంజసమని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి అన్నారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచి తన స్వలాభం చూసుకున్నాడని విమర్శించారు. పార్టీ మారిన వారితో నష్టం లేదని, భవిష్యత్‌లో కలిసికట్టుగా పనిచేసి వర్ధన్నపేటలో బీఆర్ఎస్‌ను పటిష్ఠం చేస్తామని వారు పేర్కొన్నారు.

లాసెట్ ద్వారా ఎంజేపీ లా కళాశాలల్లో ప్రవేశాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొల్పిన రెండు లా కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న లా సెట్ ర్యాంకు ద్వారానే సీట్లు కేటాయించనున్నట్లు ఎంజేపీ ఆర్సీవో మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహేశ్వరంలో బాలుర రెసిడెన్షియల్ లా కళాశాల, కాజీపేటలో నెలకొల్పిన బాలికల రెసిడెన్షియల్ లా కళాశాలలో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు కళాశాలల్లో 5 ఏళ్ల లా కోర్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసై లా సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు పొందవచ్చునని తెలిపారు. కాగా, లాసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉందని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు సుధాకర్ (ఫైల్)

వేలేరు(ధర్మసాగర్)మార్చి 19: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చ లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ.హరిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీచర గ్రామానికి చెందిన పిట్ల సుధాకర్(43) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో కొన్నేళ్ల నుంచి మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాడు. వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రూ.10లక్షలు అప్పులు చేసి బావిలో సైడ్‌బోర్లను సైతం వేయించాడు. దీంతో పాటు అప్పులు చేసి తన కూతురు రవళి వివాహం చేశా డు. వ్యవసాయంతో చేసిన అప్పులు తీర్చాలనుకున్నప్పటికీ సాగు చేసిన పంటకు సాగు నీరు లేకపోవడంతో దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చడం ఎలా అని మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్దకు సోమవారం రాత్రి వెళ్లి సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుధాకర్‌ను చుట్టు పక్కల రైతుల గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చే సరికే సుధాకర్ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు విచ్చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నాడు.

పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు కనిపిస్తే చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు కనిపిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం ఉదయం పరీక్షకు ముందు నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల నిర్వాహకులు సీఎస్, డీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఇతరత్రా నిర్వాహకులు సెల్‌ఫోన్లను పరీక్షాకేంద్రంలోకి తీసుకెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు, హెడ్మాస్టర్ల గదులు, బాత్‌రూమ్‌లలో ఎక్కడా సెల్‌ఫోన్‌లు లేకుండా చూడాలని సెట్ కాన్ఫరెన్స్‌లో స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రకటనలో హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా సెల్‌ఫోన్లు వినియోగించినట్లు తన దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

● మేడారం విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం ● 20రోజులుగా మృత్యువుతో పోరాటం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బొట్ల దేవానంద్ (40) అనే పారిశుధ్య కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. 20 రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన బొట్ల దేవానంద్ 20 యేళ్లుగా నగర పాలక సంస్థలో శానిటేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునిల్ పరిధిలో పని చేస్తున్నాడు. కాగా, మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15 నుంచి 29 వరకు మేడారం జాతరలో విధులు నిర్వర్తించాడు. జాతర విధులు ముగించుకుని 29న సాయంత్రంస్వచ్ఛభారత్ ఆటోను నడుపుకుంటూ నగరానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు జిల్లా గట్టమ్మ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ దేవానంద్ ఆటోను ఢీకొట్టి వెళ్లిపోయింది. దేవా నంద్ కాళ్లు విరిగి కడుపులో బలమైనగాయాలయ్యాయి. అక్కడి వారు గుర్తించి 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. దీంతో హైదరా బాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో మంగళవారం మృతి చెందాడు. దేవానంద్ చికిత్సకు ఇప్పటివరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబానికి ఏ అధికారులు, ఏ సంఘం నాయకులు సహకరించలేదని, ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతునికి కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.



దేవానంద్(ఫైల్)



మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల నియామకానికి కసరత్తు

మంత్రుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

హనుమకొండ టౌన్, మార్చి19: బీఆర్ఎస్ హయాంలో నియామకమైన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలిగించింది. ఇప్పుడు కొత్త (ఫైనాన్స్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, హెచ్ఆర్ అండ్ ఐఆర్) డైరెక్టర్లను నియమించేందుకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో డైరెక్టర్లుగా పనిచేసేందుకు ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కోలో పని చేస్తున్న చాలామంది సీఈలతో పాటు రిటైర్డ్ సీఈలు ఈనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసులో ఉన్నవారైతే ఎస్ఈ, సీఈగా కలిపి ఐదేళ్లు, మొత్తంగా 15 ఏళ్లు సర్వీసు పూర్తయి ఉండాలని, రిటైర్డ్ అధికారులైతే 62 ఏళ్లు దాటకూడదని షరతు విధించింది. ఈ నిబంధనల ప్రకారం ఒక్కో డైరెక్టర్ పోస్టుకు 10 నుంచి 15 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. సీఎండీ అధ్యక్షతన ఏర్పాటయ్యే ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక్కొక్క డెరెక్టర్ పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. వీరి పేర్లను సీల్డ్‌కవర్‌లో సంబంధిత మంత్రితో పాటు సీఎం దృష్టికి పంపిస్తే ముగ్గురిలో ఒక్కరిని ఖరారు చేసి ఎన్పీడీసీఎల్‌కు సమాచారం ఇస్తారు. కంపెనీ డెరెక్టర్ పేరును ప్రకటించి ఆఫర్ లేఖను మంజూరు చేస్తుందని ఎన్పీడీసీఎల్ సీనియర్ అధికారులు చెబుతున్నారు.

కాగా, డైరెక్టర్ పోస్టులను చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు పావులు కదుపుతున్నారు. సంబంధిత మంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలతో పాటు సన్నిహితులతో పైరవీలు చేస్తున్నారు. ఇదిలా వుండగా, ఎలక్షన్ కోడ్ రాకముందే నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల ప్రక్రియ ముగిసినందున నియామకాలకు ఎలాంటి అడ్డంకి రాదని పలువురు అభిప్రాయ పడుతు న్నారు. ఒక వేళ అడ్డంకిగా మారితే నియామకానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

రుణసాయానికి దూరం

వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పథకానికి నోచుకోని రైతులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 19: వ్యవసాయ మార్కెట్లలో పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ఆ పంటను గోదాముల్లో నిల్వ చేసుకుని, దానిపై సదరు రైతులు రుణం పొందేందుకు వీలుగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుబంధు (రుణసాయం) పథకాన్ని 20ఏళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ మార్కెట్లలో రైతుల నుంచి పన్ను వసూలు చేయడమే కాదు.. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు రుణం ఇచ్చి ఆసరాగా నిలిచే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పంటను అమ్మకానికి తీసుకువచ్చినప్పుడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోతే... ఆ సమయంలో ఆ రైతు సరుకును మార్కెట్ కమిటీ గోదాముల్లో లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని ఆ రశీదును మార్కెట్ కమిటీలో అందజేస్తే, అధికారులు సదరు రైతు సరుకు విలువలో 75శాతం, లేదా రూ.2లక్షలకు మించకుండా ఆరు నెలల వరకు వడ్డీలేని రుణాన్ని రైతుకు అందజేస్తారు. ఆ తరువాత రైతు పంటను మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించి తీసుకున్న రుణాన్ని మినహాయించుకుని మిగతా డబ్బులు రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు.

కేటాయించింది రూ.28కోట్లు... ఇచ్చింది రూ.7.71లక్షలే..

మార్కెట్ రీజినల్ పరిధిలో 19 జిల్లాలు, 110 మార్కెట్ కమిటీలకు 2023-24 సంవత్సరానికి గాను రైతుబంధు పథకం కింద మార్కెటింగ్‌శాఖ రూ.28కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు వరంగల్ జిల్లాలో ఒక రైతుకు రూ.2లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో ఒక రైతుకు రూ. 1.75లక్షలు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులకు రూ.4లక్షలు కలిపి రైతుబంధు పథకం నలుగురు రైతులకు రూ.7.71లక్షలు మాత్రమే ఇచ్చారు. అయితే ఈ రైతుబంధు పథకంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పథకం నిర్వీర్యమవుతోంది. అధికారులు సైతం కల్పించడానికి ఆసక్తి చూపడం లేదు. రైతులకు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మంచి ధర వచ్చే వరకు సరుకునే దాచుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అసలే ఉద్యోగుల కొరతతో ఉన్న అధికారులకు ఇప్పటికే పని ఒత్తిడికి లోనవుతున్న క్రమంలో రైతుకు మంచి అవకాశాల గురించి చెప్పే ఓపిక లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు సేవలందిస్తున్నాం..

మల్లేశం, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్

రైతుబంధు (రుణసాయం) పథకం కింద రైతులకు సేవలందిస్తున్నాం. ఈ సంవత్సరం ధాన్యం, మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులకు ఎంఎస్‌పీ కంటే మార్కెట్లో ఎక్కువ ధరలు పలుకడంతో రైతులు ఈ పథకాన్ని వినియోగించుకోలేదు. సాధారణంగా రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రైతుబంధు పథకం ద్వారా రుణం తీసుకుంటారు. ముఖ్యంగా మార్చిలో రైతులు రుణం తీసుకుంటుంటారు. రైతుబంధుపై మార్కెట్లో రైతులకు తెలిసేలా మైక్‌ల ద్వారా అనౌన్స్ చేయిస్తున్నాం.

ఎంటెక్ విద్యార్థి అదృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 19: డివిజన్ కేంద్రానికి చెందిన ఎంటెక్ విద్యార్థి గుండు సాయికృష్ణ కనిపించడంలేదని కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన గుండు రమేష్ కుమారుడు సాయికృష్ణ మూడేళ్లుగా తాత నర్సయ్య వద్ద ఘన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 16న జనగామలో స్నేహితుడి పెళ్లికి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. 17వ తేదీ సాయంత్రం వరకు కూడా తిరిగి రాకపోవడంతో నర్సయ్య సాయికృష్ణ తండ్రి రమేష్‌కు సమాచారం అందించారు. అప్పటినుంచి సాయికృష్ణ ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో సాయికృష్ణ తాత నర్సయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ముస్క రాజు కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు 8712685208 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

జనగామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. కుంబ రవి, సజ్జ రాజు, సజ్జ రామాంజనేయులు, గంట నందిబాబు, శీలం లాజర్, శీలం లాజర్, శీలం చంద్రశేఖర్, గంట విజయ్, గంట రాజును అరెస్ట్ చేసి వారి వద్ద రెండు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, రూ.3290 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

నిజాంపై మర్లబడ్డ ధీర వనిత మల్లు స్వరాజ్యం

- వర్ధంతి సభలో కొనియాడిన నాయకులు



పాలకుర్తిలో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పాలకుర్తి, మార్చి 19: నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన వారిలో మల్లు స్వరాజ్యం ఒకరని సీపీఎం నాయకులు కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజీవ్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు చిట్యాల సోమన్న మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం ప్రధాన భూమికను పోషించారని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన స్వరాజ్యం పేద ప్రజల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకురాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాసంపల్లి నాగయ్య, వెంకన్న, పెద్దపురం, రాజు, అబ్బాస్, ఉప్పలయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కామ్రేడ్ మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో పేదలు ఇండ్ల స్థలాలు సాధించుకోవాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇర్రి అహల్య పిలుపునిచ్చారు. మంగళవారం గోపాల్‌నగర్ వద్ద భూపోరాట శిబిరంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి, పేద ప్రజల కోసం భూస్వాములకు వ్యతిరేకంగా, దున్నేవాడికి భూమికావాలని ఉద్యమించిన మల్లు స్వరాజ్యంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గోపాల్‌నగర్ 174 సర్వే నంబర్‌లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చీర రజిత, కొండా వరలక్ష్మీ, శోభ, బుచ్చమ్మ, పద్మ, పుష్ప, లక్ష్మీ, మల్లమ్మ, మహిళలు పాల్గొన్నారు.

జనగామ కల్చరల్: ఉద్యమాల హరివిల్లు మల్లు స్వరాజ్యం అని సీపీఎం నేతలు కొనియాడారు. మంగళవారం మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సాంబరాజు యాదగిరి, జోగు ప్రకాష్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో స్వరాజ్యం ముఖ్య భూమిక పోషించారన్నారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించిన స్వరాజ్యం నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొట్ల శ్రీనివాస్, చుంచు విజేందర్, కళ్యాణం లింగం, బాల్నె వెకటమల్లయ్య, సురేష్ నాయక్, ఎండి.షైబెల్లి, కొండ వరలక్ష్మి, అంజమ్మ, యాదలక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

‘పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి’



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 19: మాతా, శిశు సంరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఆయాలు పోషణ పక్వాడ్ ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. హైస్కూల్‌లో కిషోర బాలికలకు నిర్వహించిన అవగాహనా సమావేశంలో మాట్లాడారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషకాహారం, ఆహార వైవిధ్యం, తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహారం, పోషణ, పెరటి తోటల పెంపకం, బాలికల్లో రక్త హీనత, వ్యక్తిగత పరిశుభ్రత అంశాల్లో యువతులు, విద్యార్థినులు, కిషోర బాలికలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.రాణి, ఎం.ప్రభ, స్వరూప, సునిత, రాణి, మాధవి, సరోజన, లలిత, లిఖిత భవాని తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: చిరుధాన్యాల వినియోగంతో కల్గే ప్రయోజనాల గురించి అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పోషణ పక్వాడా ఉత్సవాల్లో భాగంగా మీదికొండ గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నిత్యం చిరు ధాన్యాలను ఆహారంలో తీసుకోవాలని కోరారు. చిరు ధాన్యాల్లో పోషకాల శాతం ఎక్కువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీచర్లు సువర్ణ, రమ, మంగ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని జఫర్‌గఢ్ జడ్పీటీసీ ఇల్లందుల బేబీ అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మంపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందించాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యలు తొలగిపోతాయన్నారు. అలాగే కేంద్రాల్లో అందిస్తున్న చిరుధాన్యాలతో కూడిన ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. మహిళలచే తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ పోషక విలువలు, పోషక పదార్థాలు, తల్లిపాల ఆవశ్యకత, రక్తహీనత వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ తాటికొండ అనిత, అంగన్‌వాడీ టీచర్లు రాణి. నర్మద, శాంత, ఆయాలు గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

వరి కొయ్యల్లో మొక్కజొన్న సాగు చేయాలి

- ‘రైతు నేస్తం’లో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



ఛాగల్ రైతువేదికలో శాస్త్రవేత్తల సూచనలు వింటున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 19: యాసంగి వరికోతలు ముగిసిన తరువాత రైతులు వరి కొయ్యకాళ్లలో మొక్కజొన్న సాగు చేస్తే అధిక లాభాలు ఉంటాయని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం ఛాగల్ రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వారు రైతులకు సూచనలు చేశారు. రైతు నేస్తం కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రైతులు హాజరై శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలను వినడంతో పాటు వారి సమస్యలను తెలియపరిచారు. మొక్కజొన్న, వరి పంటలో ప్రస్తుతం తలెత్తుతున్న సమస్యలకు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. ఆయిల్‌పామ్ సాగు చేసేవారికి ప్రభుత్వం సబ్సీడీ ఇస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తూతూమంత్రంగా ‘రైతునేస్తం’

జనగామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు సంబంధించి రైతులకు సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రారంభించిన ‘రైతునేస్తం’ కార్యక్రమం జిల్లాలో మంగళవారం తూతూమంత్రంగా సాగింది. రైతు నేస్తం’ కార్యక్రమంలో భాగంగా పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జనగామ మండలం గానుగుపహాడ్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్, కొడకండ్ల రైతు వేదికల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు లైవ్ ద్వారా సూచనలు ఇచ్చే కార్యక్రమం జరిగింది. ‘వరిలో ప్రస్తుతం పాటించవలసిన మెలకువలు’ అనే అంశంపై జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త బి.శ్రీనివాస్, ‘ఆయిల్‌పామ్ సాగుపై’ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ రాజశేఖర్, ‘వేసవిలో కూరగాయల సస్యరక్షణ, మందుల వాడకం’ అనే అంశంపై రాజేంద్రనగర్‌లో అఖిల భారత సస్యరక్షణ, మందుల అవశేషాల పరిశోధనా విభాగం ప్రధాన శాస్త్రవేత్త కె.కవిత రైతులకు సూచనలు ఇచ్చారు. కాగా.. దీనిపై వ్యవసాయ అధికారులు రైతులకు సరైన విధంగా సమాచారం ఇవ్వలేదు. దీంతో ఎక్కువ మంది రైతులు ఈ ప్రత్యక్షప్రసారాన్ని వీక్షించలేకపోయారు. వ్యవసాయ అధికారులు కేవలం పత్రికాప్రకటన ఇచ్చి వదిలేయడంతో మంగళవారం జరిగిన వ్యవసాయ శాస్త్రవేత్త లైవ్ కార్యక్రమాన్ని చూసి సూచనలు పొందలేకపోయారు. కాగా.. ఎన్నికల కోడ్ ఉన్నందునే ఎక్కువ మంది రైతులకు చెప్పలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు

(5వ పేజీ తరువాయి)

అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారి అయిన ప్రణీత్‌రావు సొంత ఊరు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడిపల్లి కావటం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రణీత్‌రావు స్వగ్రామం మేడిపల్లి అయితే తన అమ్మమ్మ, అత్తగారి ఊరు పర్వతగిరి మండలం కేంద్రం. బాల్యం మొత్తం మేడిపల్లిలోనే గడిచినా ఆయనకు పర్వతగిరితోనే ఎక్కువ సత్సంబంధాలున్నాయని స్థానికులు పేర్కొంటునానరు. ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన ప్రణీత్‌కు సాంకేతిక విద్యపై పూర్తిస్థాయిలో ఉన్న పట్టుతో స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి త్వరితగతిన పదోన్నతులు పొందినట్లుగా సమాచారం. అయితే ప్రణీత్‌రావు అత్తింటివారు, సంబంధీకులు మొత్తం చాలాఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

పర్వతగిరిలో వార్‌రూమ్?

గత ప్రభుత్వం హయంలో నాటి పీసీసీ నేత రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలున్న కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ఇటీవల హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించిన పోలీసులు ఏఏ జిల్లాల్లో.. ఎక్కడెక్కడ వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారని, సహకరించిన ఇన్‌స్పెక్టర్ల జాబితా, ధ్వంసం చేసిన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌ల వివరాలను రాబట్టినట్లు సమాచారం. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా పర్వతగిరిలో కూడా వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు ప్రణీత్‌రావు చెప్పినట్లు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో ఆయనిచ్చిన సమాచారంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించి విచారిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఓ సీఐ నేతృత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తెలియరాగా.. ఈ వ్యవహారమంతా ఎలా జరిగిందనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలతో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలు, కీలక అధికారుల ఫోన్లు ట్యాప్ చేశారని, ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ నేత కూడా ఉన్నారని ప్రచారం జరగడం, దర్యాప్తు బృందాలు వరంగల్‌పై నిఘా పెట్టడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రణీత్‌రావు ఎవరో తెలియదన్న ఎర్రబెల్లి

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుండటం, సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండటంపై ఆయన స్పందించారు. తనకు ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదని మంగళవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. పర్వతగిరిలో ప్రణీత్‌రావుకు బంధువులు ఉండటం మూలంగా వచ్చి పోయేవాడని, తనను కొందరు కావాలనే ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తానెవరికీ భయపడేది లేదని, తన పేరు చెప్పాలని ప్రణీత్‌రావుపై ఒత్తిడి తెస్తున్నారని ఎర్రబెల్లి పేర్కొనటంతో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం మున్ముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న చర్చ జరుగుతోంది.

కలుపు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- మల్చింగ్ సాగుపై ఆసక్తి చూపుతున్నరైతులు
- రాయితీతో ప్రోత్సాహం అందిస్తున్న ప్రభుత్వం



మల్చింగ్ పద్ధతిలో బంతిసాగు (ఫైల్)

బచ్చన్నపేట, మార్చి 19: పంటల సాగులో కలుపు నివారణ, తక్కువ మోతాదులో నీటి వినియోగం కోసం రైతులు మల్చింగ్ సాగు విధానంపై ఆసక్తి చూపుతున్నారు. శ్రమ, పెట్టుబడి, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగం తక్కువతో ఉద్యాన పంటలు, కూరగాయలు, పుచ్చకాయ, సన్ మిలన్, ఇతర తీగజాతి పంటలను సాగు చేస్తూ మంచి దిగుబడులను సాధిస్తున్నారు. నానాటికి పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పంటలు వాడిపోయి ఎదగక దిగుబడులు పడిపోయే పరిస్థితుల్లో రైతులు మల్చింగ్ సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం జిల్లాలో వందలాది హెక్టార్లలో రైతులు మల్చింగ్ పద్ధతిలో సాగుచేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కాగా సబ్సిడీపై మల్చింగ్ కవర్‌ను ఉద్యానవనశాఖ తరుపున అందిస్తున్నా అది కొంతమందికే పరిమితమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో కేవలం 15 హెక్టార్లకు మాత్రమే ఇప్పటి వరకు అందించినట్టు చెబుతున్నారు. మల్చింగ్ విధానంతో సాగురైతుకు కలుగుతున్న లాభాలను వివరిస్తూ ప్రచారం చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

మల్చింగ్‌తో ప్రయోజనాలు....

మొక్కల చుట్టూ నేలను ఏదైనా పదార్థంతో కప్పి ఉండడాన్ని మల్చింగ్ అంటారు. మల్చింగ్ సాగులో మొక్క మొదటి భాగంలో సూర్యరశ్మి పడకుండా ఉండి భూమి లోపల, పైనా తేమశాతం తగ్గకుండా మల్చింగ్ కవర్ ఉపయోగపడుతుంది. మొక్కలకు తెగుళ్ల వ్యాప్తి చెందకుండా, క్రిమికీటకాలు సోకకుండా తేమశాతం తగ్గకుండా కాపాడుతుంది. దీంతో నీటి వినియోగం తగ్గుతుంది. కలుపు మొక్కల బెడద లేకపోవడంతో మొక్క ఏపుగా, బలంగా పెరిగి దిగుబడి పెరుగుతుంది.

మల్చింగ్ కవర్లను ఉపయోగించే విధానం...

మల్చింగ్ కవర్లు వివిధ రంగులు, మందంతో మార్కెట్లో లభిస్తాయి. సీజన్‌లో వేసే పంటను బట్టి మల్చింగ్ కవర్లను ఎంపిక చేసుకోవాలి. ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేస్తారో అందుకు తగ్గట్టుగా సాళ్ల పొడవును బట్టి ఎంపిక చేసుకోవాలి. పంట చేనులో మొదట బెడ్(ఎత్తైన గట్ల పద్ధతి)వేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. డ్రిప్పు పరిచి మల్చింగ్ కవర్‌ను బెడ్‌పై పరిచి మట్టితో కప్పాలి. తర్వాత కవర్‌పై పైప్‌తో రంధ్రాలు చేసుకుని, డ్రిప్ ద్వారా నీటిని అందించి నేలను తడిగా ఉంచుకోవాలి. తర్వాత విత్తనం విత్తుకోవాలి. మొలకెత్తిన తర్వాత కొద్దిగా పెరగగానే కాండాన్ని రంధ్రం పైకి లాగాలి. కవర్ ఉండడం వల్ల కలుపు మొక్కలు పెరిగే అవకాశం చాలా తక్కువ ఉంటుంది. దీంతో కూలీల ఖర్చు ఆదా అవుతుంది.

ప్రభుత్వం రాయితీ పొందడం ఇలా....

మల్చింగ్ సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం యేటా ప్రతిపాదనలు తీసుకుంటుంది. ఒక హెక్టార్ సాగును ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ముందుగా మల్చింగ్ కవర్‌ను రైతులు కొనుగోలు చేసుకోవాలి. యూనిట్ విలువ రూ.32వేలు కాగా, 50 శాతం రాయితీ డబ్బులు రూ.16 వేలు రైతు ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం రైతులు మొదట క్లస్టర్ లెవెల్ ఉద్యాన అధికారిని సంప్రదించి దరఖాస్తుతో పాటు, పాసుపోర్టు సైజ్ ఫొటో, పట్టా పాస్‌బుక్, ఆధార్, బ్యాంకుఖాతా జిరాక్స్ అందజేయాలి. అధికారులు వచ్చి తనిఖీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో సంబంధిత శాఖ నుంచి రాయితీ విడుదల చేస్తారు.

మల్చింగ్‌తో మంచి దిగుబడి వచ్చింది..



పుట్ట మల్లేశం, రైతు వీఎస్ఆర్‌నగర్

మల్చింగ్ సాగు ఎంతో ఎంతో మేలు. కూలీల ఖర్చు చాలా తక్కువ. మల్చింగ్ పద్ధతిలో టమోటా, బంతి, కూరగాయల పంటలను సాగు చేస్తాను. ప్రభుత్వ సబ్సిడీ ఇచ్చే అవకాశం లేకున్నా, కవర్‌లను కొనుగోలు చేసి ఉపయోగిస్తాను. రైతులు ఈ పద్ధతిన సాగు చేయటం మంచిది.

డిమాండ్ మేరకు ఏర్పాట్లు చేస్తాం..



రవికాంత్, ఉద్యాన శాఖ అధికారి

మల్చింగ్ పద్ధతిలో సాగు చేసే రైతులను తాము ఎప్పుడు ప్రోత్సహిస్తూ ఉంటాము. సబ్సిడీ కోసం కేటాయింపుకు పరిమితులు ఉంటాయి. రైతుల డిమాండ్‌ను బట్టి అధికారుల దృష్టికి తీసుకెళతాము. అవసరమైన రైతులకు పూర్తి వివరాలు అందించి, దరఖాస్తులు చేసుకునేందుకు కృషి చేస్తాం.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీరామ్

దేవరుప్పుల, మార్చి 19: దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నల్ల శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం తొర్రూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆమె నల్ల శ్రీరామ్‌ను ఘనంగా సన్మానించారు. శ్రీరామ్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు, కార్యకర్తలను కలుపుకుని పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానన్నారు.

రోడ్డెక్కిన కృష్ణమూర్తి వర్గీయులు..

దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని మార్చడంతో పార్టీ కార్యకర్తలు మంగళవారం రాత్రి రోడ్డెక్కారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన పెద్ది కృష్ణమూర్తిని తొలగించి నల్ల శ్రీరామ్‌ను నియమించిన నేపథ్యంలో పెద్ది కృష్ణమూర్తి వర్గీయులు ధర్నా చేశారు. ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈలోగా పోలీసులు రావడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో పారిపెల్లి శ్రీనివాస్, గొడిషాల శ్రీనివాస్, బట్ట అబ్బయ్య, ఉప్పుల అంజయ్య, కారుపోతుల యాకస్వామి, పాము యాకస్వామి, చింత భిక్షపతి, చిల్పూరి నర్సయ్య, ఉప్పుల ఉప్పలయ్య, భోనగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘సస్పెండ్ చేసే అధికారం వారికి లేదు’

కొడకండ్ల, మార్చి 19: తమను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌కు లేదని సస్పెన్షన్‌కు గురైన మండల ఉపాధ్యక్షుడు బొమ్మెరబోయిన మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాము కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి పని చేయలేదని, పార్టీ అధికారంలో లేకున్నా అభిమానంతో పది సంవత్సరాలుగా సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని పార్టీని కాపాడుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాము ఏం తప్పు చేశామో చెప్పకుండా, వివరణ ఇచ్చుకునే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు. ఈ విషయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి నిజాలు తెలుసుకుని విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పృథ్వీరెడ్డికి కీలక పదవి

దేవరుప్పుల, మార్చి 19: సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఇప్ప పృథ్వీరెడ్డికి కీలక పదవి లభించింది. తెలంగాణ విద్యార్థి ఉద్యమ కారుల సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా ఆయన నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా పృథ్వీరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయి కమిటీలు వేసి అర్హులైన ఉద్యమకారులను గుర్తించి వారికి 250గజాల్లో ఇంటిని నిర్మించి ఇచ్చే ప్రయత్నం చేస్తానని అన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత

తరిగొప్పుల, మార్చి 19: తెలంగాణ సాంస్కృతిక, ప్రచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై శ్వేత ముఖ్యఅతిథిగా హాజరై సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, మొబైల్ ఫోన్‌లు ఇవ్వరాదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాజాత టీం లీడర్ తిప్పర్తి శ్రీనివాసులు, పిన్నమల్ల సాంబయ్య, గడిపె బాలయ్య, బావండ్లపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

చిలుపూర్, మార్చి 19: మండలంలోని తీగలతండా సమీపంలో చిన్నపెండ్యాల-తరిగొప్పుల ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చిలుపూర్ వడ్డెర కాలనీకి చెందిన ఓర్సు సాంబరాజు తన సతీమణి సరస్వతితో కలిసి బైక్‌పై చిన్నపెండ్యాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా, ఎదురుగా మరో బైక్‌పై వచ్చిన బొమ్మిశెట్టి ఎల్లయ్య ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఓర్సు సాంబరాజుకు తలపగిలి తీవ్ర గాయాలు కాగా, ఆయన భార్య సరస్వతితో పాటు, ఎల్లయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బచ్చన్నపేట, మార్చి 19: వాస్విక్ ఫౌండేషన్, హోప్ ఆప్ హ్యాండ్ వారి సౌజన్యంతో మంగళవారం రాంచంద్రాపూర్ గ్రామంలో మల్టీమెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రైతు వేదికలో ఏర్పాటు చేసిన శిబిరంలో స్థానికులతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బచ్చన్నపేట ఎస్ఐ సతీష్, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహోన్నత ఆశయంతో నిడిగొండ నరేష్‌కుమార్ వాస్విక్ ఫౌండేషన్‌ను స్థాపించి, రాష్ట్రవ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. తాను సంపాదించిన దానిలో కొంత ఇతరులకు సహాయం చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు చేపట్టి జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, మోకాళ్ల నొప్పులు, దంతాలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అద్దాలు అందజేశారు. మొత్తంగా 560 మందికి పరీక్షలు నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆముదాల భూపాల్‌రెడ్డి, కోడూరు శివకుమార్‌గౌడ్, మల్లారెడ్డి, నూకల నర్సిరెడ్డి, ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, హేమంత్, కెన్నడీ, జయరాజ్, వేల్పాద్రి పాల్గొన్నారు.